ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : మంత్రి సీతక్క

ప్రజాశక్తి –హైదరాబాద్ బ్యూరో

మొంథా తుఫాన్ నేపథ్యంలో అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించాలనీ, అత్యవసర సేవలు, చర్యలకు సంసిద్ధంగా ఉండాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ (సీతక్క) ఆదేశించారు. మొంథా తుఫాన్ ప్రభావం తీవ్రంగా ఉన్న మహబూబాబాద్, ములుగు జిల్లా కలెక్టర్లు, అధికారులతో మంత్రి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. చలిగాలులు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉంటూ, స్వీయ నియంత్రణ పాటించాలని సూచించారు. రైతులు, పశువుల కాపరులు తమ పశువులు, పంటల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లవద్దని స్పష్టం చేశారు. ప్రజలు వాగులు, చెరువులు దాటే ప్రయత్నం చేయరాదని, నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్న ప్రాంతాలకు దూరంగా ఉండాలని కోరారు. పలు చోట్ల రైళ్లు నిలిచిపోయినట్టు సమాచారం అందుతున్న నేపథ్యంలో ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా తక్షణమే సహాయక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రయాణికులకు ఆహారం, తాగునీరు వంటి అవసరాలు తీర్చాలని సూచించారు. తుఫాను ప్రభావం తగ్గే వరకు ప్రజలు ప్రభుత్వ ఆదేశాలను పాటించాలనీ, అత్యవసరమైతే తప్ప ఇండ్ల నుంచి బయటకు రాకూడదని మంత్రి సీతక్క కోరారు.

క్షేత్ర స్థాయిలో అందుబాటులో ఉండండి

- ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి
- ధాన్యం తడవకుండా ముందస్తు చర్యలు చేపట్టండి
- మొంథా తుపాన్ ప్రభావంపై ముఖ్యమంత్రి ఆరా
- అప్రమత్తంగా ఉండాలని అధికారులకు ఆదేశం



ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

మొంథా తుపాన్ నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. వర్షాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై బుధవారం సిఎం అధికారులతో మాట్లాడి వారికి దిశానిర్దేశం చేశారు. వరి కోతల సమయం కావడం... పలు చోట్ల కళ్లాల్లో ధాన్యం ఆరబోసిన నేపథ్యంలో ఎటువంటి నష్టం వాటిల్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మొంథా తుపాను ప్రభావం ఉమ్మడి ఖమ్మం, ఉమ్మడి వరంగల్, ఉమ్మడి నల్గొండ జిల్లాల్లో అధికంగా ఉందని, హైదరాబాద్ సహా ఇతర జిల్లాల్లోనూ భారీ వర్షాలు కురుస్తుండడంతో అన్ని శాఖల అధికారులు, సిబ్బంది క్షేత్ర స్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండాలని సిఎం ఆదేశించారు. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ జంక్షన్‌లో గోల్కొండ ఎక్స్‌ప్రెస్, గుండ్రాతిమడుగు స్టేషన్‌లో కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లు నిలిచిపోవడం.. పలు రైళ్లను దక్షిణ మధ్య రైల్వే అధికారులు దారి మళ్లించిన నేపథ్యంలో ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. మొంథా తుపాన్ ప్రభావం అధికంగా ఉన్న జిల్లాల్లో ఎస్‌డిఆర్‌ఎఫ్, ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలు సమన్వయం చేసుకోవాలని, జిల్లా కలెక్టర్లు ఆయా బృందాలకు తగిన మార్గదర్శకత్వం వహించాలని సిఎం సూచించారు. వాగులు, వంకలు పొంగే ప్రమాదమున్నందున లోతట్టు ప్రాంతాల్లోని కుటుంబాలను సహాయక శిబిరాలకు తరలించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

రిజర్వాయర్లు, చెరువులు, కుంటల నీటి మట్టాన్ని సంబంధిత శాఖ అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ నీటి విడుదలపై ముందుగానే కలెక్టర్లు, క్షేత్ర స్థాయి సిబ్బందికి సమాచారం ఇవ్వాలని సూచించారు. పూర్తిగా నిండిన చెరువులు, రిజర్వాయర్ల వద్ద ఇసుక బస్తాలను సిద్ధంగా ఉంచాలన్నారు. రోడ్లపై నీరు నిలిచిన ప్రాంతాలు, లోలెవల్ బ్రిడ్జీలు, కాజ్‌వేలపై నుంచి రాకపోకలు పూర్తిగా నిషేధించాలన్నారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు వాటి సమీపంలో బారికేడ్లు ఏర్పాటు చేసి పర్యవేక్షించాలని సిఎం ఆదేశించారు. తుపాను ప్రభావంతో వర్షపు నీరు నిల్వ ఉండి దోమలు, ఇతర క్రిమికీటకాలు విజృంభించి అంటువ్యాధులు ప్రబలే ప్రమాదమున్నందున నగర, పురపాలక, గ్రామ పరిపాలనా సిబ్బంది ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపట్టాలని సూచించారు. వైద్యారోగ్య శాఖ తగినంత మందులు అందుబాటులో ఉంచుకోవాలని, అవసరమైన చోట్ల వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రాణ, ఆస్తి నష్టం, పశు నష్టం చోటు చేసుకోకుండా జాగ్రత్తలు వహించాలని సిఎం సూచించారు. రెవెన్యూ, విద్యుత్, పంచాయతీరాజ్, ఆర్ అండ్ బీ, వైద్యారోగ్య, పోలీస్, అగ్నిమాపక శాఖలు, ఎస్‌డిఆర్‌ఎఫ్ సిబ్బంది సమన్వయంతో సాగాలన్నారు. హైదరాబాద్ నగరంలో ప్రజల నుంచి వచ్చే వినతులకు జిహెచ్ఎంసి, హైడ్రా, ఎస్‌డిఆర్‌ఎఫ్, అగ్నిమాపక శాఖ సిబ్బంది తక్షణమే స్పందించాలని రేవంత్ రెడ్డి ఆదేశించారు.

అజహరుద్దీన్‌కు మంత్రి పదవి

- ఎఐసిసి గ్రీన్ సిగ్నల్
- ఇప్పటికే ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రకటన
- రాజ్‌భవన్‌లో శుక్రవారం ప్రమాణ స్వీకారం?



ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

జూబ్లీహిల్స్‌ఉపఎన్నికలనేపథ్యంలోఅధికార కాంగ్రెస్ పార్టీ కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర మంత్రివర్గంలో మైనార్టీలకు ప్రతినిధ్యం కల్పించాలనే నిర్ణయానికి ఎఐసిసి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. హైదరాబాద్‌కు చెందిన కాంగ్రెస్ నేత, ప్రముఖ క్రికెటర్ అజహరుద్దీన్‌ను మంత్రివర్గంలోకి తీసుకుంటున్నట్టు వెల్లడించింది. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఆయన్ను ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎంపిక చేసిన సంగతి తెలిసిందే. గవర్నర్ కోటా కింద ఎమ్మెల్సీలుగా అజహరుద్దీన్, తెలంగాణ జనసమితి అధ్యక్షులు కోదండరామ్‌ను కాంగ్రెస్ పార్టీ ఎంపిక చేసింది. అయితే, వీరిద్దరి నియామకానికి గవర్నర్ ఇంకా ఆమోదం తెలపలేదు. ఎమ్మెల్సీ నియామక ప్రక్రియ పూర్తికాకపోయినప్పటికీ అజాహరుద్దీన్ మంత్రిగా ప్రమాణం చేసేందుకు ఏఐసీసీ ఆమోదం తెలిపినట్టు సమాచారం. ఆ నివేదిక క్లియర్ అయినా, కాకపోయినా ఆయన మంత్రి పదవి చేపట్టవచ్చు. కాకపోతే ఆరు నెలల్లో ఎమ్మెల్సీగానో, ఎమ్మెల్యేగానో ఎన్నికై ఉండాలి. లేకపోతే ఆయన మంత్రి పదవి కోల్పోతారు. ఈ పరిస్థితులు ఎలా ఉన్నా అజహరుద్దీన్‌కు మంత్రి పదవి ఇవ్వాలని సిఎం రేవంత్‌రెడ్డి ప్రతిపాదించారు. దీంతో ఆయన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాసానికి వెళ్లి కృతజ్ఞతలు తెలిపారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో భారీగా ఉన్న మైనార్టీల ఓట్లు గంపగుత్తగా రాబట్టేందుకు వీలుగా అజహరుద్దీన్‌కు మంత్రి పదవి కట్టబెట్టాలనేది హస్తం పార్టీ వ్యూహంగా కనిపిస్తున్నది. మంత్రి వర్గ విస్తరణపై కొన్ని రోజులుగా ఏఐసీసీ కసరత్తు చేసింది. ముస్లిం మైనార్టీ వర్గానికి చెందిన అజహరుద్దీన్‌కు మాత్రమే ప్రస్తుతం మంత్రి పదవి ఇవ్వాలని నిర్ణయించినట్టుగా తెలిసింది. మరో రెండు మంత్రిపదవులు ఎప్పుడు భర్తీ చేస్తారనే విషయంలో స్పష్టత లేదు. అజహరుద్దీన్ 2023 అసెంబ్లీ ఎన్నికల్లో జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. అయినా తాజాగా జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆయన సిద్ధపడ్డారు. అయితే, ఆయనకు కాంగ్రెస్ అధిష్టానం ఎమ్మెల్సీ పదవి కట్టబెట్టాలని నిర్ణయించింది. ప్రస్తుత రాష్ట్ర మంత్రివర్గంలో 15 మంది ఉండగా.. మరో ముగ్గురికి మంత్రి పదవులు ఇచ్చేందుకు అవకాశముంది. అందులో మొదటిసారి ముఖ్యమంత్రితోపాటు 12 మంది మంత్రులుగా ప్రమాణం చేశారు. ఇటీవల జరిగిన మంత్రివర్గ విస్తరణలో ముగ్గురు మంత్రులుగా ప్రమాణం చేశారు. ప్రస్తుతం మరో ముగ్గురికి మంత్రి పదవులు ఇచ్చేందుకు అవకాశం ఉండటంతో ఆ పార్టీ అధిష్టానం ముస్లిం మైనార్టీకి అవకాశం కల్పించింది. ఒక వేళ గవర్నర్ కోటాలో అజాహరుద్దీన్‌కు అవకాశం దక్కకపోతే త్వరలో ఖాళీ కానున్న ఎమ్మెల్సీ స్థానంలో ఒకటి ఆయనకు కేటాయిస్తున్నారని తెలిసింది. ఇంకా మిగిలి ఉన్న రెండు మంత్రి పదవులు ఏయే సామాజిక వర్గానికి ఇవ్వాలనే దానిపై కసరత్తు కొనసాగుతున్నట్టు తెలుస్తుంది.

సిఎం రేవంత్ రెడ్డికు అజహరుద్దీన్ కృతజ్ఞతలు

తనను మంత్రివర్గంలోకి తీసుకుంటున్నందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అజహరుద్దీన్ కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ నివాసంలో ఆయన్ను ఈ మేరకు మర్యాదపూర్వకంగా కలిశారు.

భారత్ రైస్ కాన్ఫరెన్స్‌లో పాల్గొననున్న పౌర సరఫరాల శాఖ

హైదరాబాద్ బ్యూరో : ఆల్ ఇండియా రైస్ ఎగుమతిదారుల సంఘం ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం "భారత్ ఇంటర్నేషనల్ రైస్ కాన్ఫరెన్స్ (బిఐఆర్‌సి)" ను అక్టోబర్ 30, 31 తేదీలలో న్యూఢిల్లీలో నిర్వహిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు తెలంగాణ పౌర సరఫరాల శాఖ ఈ సదస్సులో పాల్గొనాలని నిర్ణయించింది. రాష్ట్ర బియ్యానికి అంతర్జాతీయ మార్కెట్లో ఎగుమతి అవకాశాలను విస్తరించేందుకు ఈ కాన్ఫరెన్స్‌ను సద్వినియోగం చేసుకునేందుకు వీలుగా తెలంగాణ పౌర సరఫరాల శాఖ కాన్ఫరెన్స్‌లో పాల్గొనాలని నిర్ణయం తీసుకుంది. అందులో భాగంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం సహకారంతో ప్రత్యేక స్టాల్‌ను ఏర్పాటు చేయనున్నట్టు ఆ శాఖ బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది.

10వ తరగతి వార్షిక పరీక్షల ఫీజు చెల్లింపునకు నోటిఫికేషన్

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

పదవ తరగతి వార్షిక పరీక్షల ఫీజు చెల్లించేందుకు ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ నోటిఫికేషన్ విడుదల చేశారు. ఎస్‌సిసి, ఒఎస్‌సిసి, వొకేషనల్ వార్షిక పరీక్షల కోసం రెగ్యులర్, ఒకసారి ఫెయిల్ అయిన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఎలాంటి అపరాధ రుసుం లేకుండా ఈ నెల 30 నుంచి నవంబర్ 13 వరకు, రూ.50 అపరాధ రుసుంతో నవంబర్ 15 నుంచి 29 వరకు, రూ.200 అపరాధ రుసుంతో డిసెంబర్ 2 నుంచి 11 వరకు, రూ.500 అపరాధ రుసుంతో డిసెంబర్ 15 నుంచి 19 వరకు చెల్లించవచ్చు. అన్ని సబ్జెక్టులు రాసేందుకు రూ.125, గరిష్టంగా మూడు సబ్జెక్టులు రాసేందుకు రూ.110, మూడు సబ్జెక్టుల కన్నా ఎక్కువ రాసేందుకు రూ.125, వొకేషనల్ అభ్యర్థులు రెగ్యులర్ ఎగ్జామ్ ఫీ రూ.125తో పాటు అదనంగా రూ.60 చెల్లించాల్సి ఉంది. ఆయా పాఠశాలలు నిర్దేశించిన ఫీజులను మాత్రమే వసూలు చేయాలనీ, అందుకు వీలుగా స్కూల్ నోటీస్ బోర్డులో ఫీజుల వివరాలు పెట్టాలని ఆదేశించారు. ఎలాంటి ఉల్లంఘనలు జరగకుండా జిల్లా విద్యాధికారి, మండల విద్యాధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు.

సమాజాన్ని దెబ్బతీస్తున్న మత్తు పదార్థాలు

- మహిళలపై మద్యం, డ్రగ్స్ ప్రభావం ఆందోళనకరం
- ఐద్వా జాతీయ కోశాధికారి పుణ్యవతి



సెమినార్‌లో మాట్లాడుతున్న పుణ్యవతి

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

మాదకద్రవ్యాలు, మద్యం, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలు సమాజాన్ని క్రమంగా దెబ్బతీస్తున్నాయని, మహిళలు, యువతపై వీటి ప్రభావం ఆందోళనకరంగా ఉందని ఐద్వా జాతీయ కోశాధికారి పుణ్యవతి అన్నారు. బుధవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని టీఎస్ యూటీఎఫ్ భవనంలో 'మాదక ద్రవ్యాలు–మహిళలు, సమాజంపై ప్రభావం' అనే అంశంపై నిర్వహించిన సెమినార్‌లో ఆమె మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మత్తు పదార్థాల నియంత్రణలో విఫలమయ్యాయని విమర్శించారు. రాష్ట్రంలోని ప్రతి గల్లీలో బెల్ట్‌షాపులు పెరిగి మద్యం ఏరులై పారిపోతోందని అన్నారు. మంచినీళ్లు దొరకడం కష్టమవుతున్నా, మద్యం మాత్రం ఎక్కడైనా సులభంగా లభిస్తోందన్నారు. కల్తీ మద్యం కారణంగా అనేకమంది ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. డ్రగ్స్ నియంత్రణలో పోలీసులు, నిఘాసంస్థలు విఫలమయ్యాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలోనే కాకుండా ఇతర దేశాల నుంచి పెద్దఎత్తున మత్తు పదార్థాలు అక్రమంగా రవాణా అవుతున్నా, పాలకులు దాన్ని అరికట్టడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శించారు. డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలను సేవించే యువకులు, పురుషులు.. మహిళలపై అనేక అఘాయిత్యాలకు పాల్పడుతున్నారని అన్నారు.

చిన్నారుల నుంచి వృద్ధుల వరకు లైంగికదాడులు, హత్యలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. యుక్తవయస్సులోనే వితంతువులుగా మారిన మహిళలు తమ పిల్లలను పోషించుకోలేక, అనేకమంది తప్పుడు మార్గాలకు వెళ్తున్న దుస్థితి ఉందన్నారు. సోషల్ మీడియాలో విచ్చలవిడిగా అశ్లీలత వ్యాప్తి చెందుతూ యువతను దారి తప్పిస్తోందన్నారు. వీటిని అరికట్టేందుకు సమాజం బలమైన ఉద్యమాలతో ముందుకు రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. ఐద్వా జాతీయ స్థాయిలో మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా అనేక ఉద్యమాలు, పోరాటాలు నిర్వహిస్తున్నదన్నారు. ఇక గ్రామీణ స్థాయి వరకు ఈ ఉద్యమాలను విస్తరించి మహిళలను చైతన్యవంతులను చేసి, ఈ రుగ్మతలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాడుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రభావతి, జిల్లా అధ్యక్షులు పోలేబోయిన వరలక్ష్మి, రాష్ట్ర కమిటీ సభ్యులు కొండ అనురాధ, జిల్లా ఉపాధ్యక్షులు తుమ్మల పద్మ, పాదూరి గోవర్ధన, సుల్తానా, మేకల వరుణమ్మ, ఉమా, వెంకటమ్మ, మిర్యాల శ్రీవాణి, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

చెరుకు రైతుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వివక్ష

- తెలంగాణలోనూ టన్ను చెరుకుకు రూ. 5,500 ఇవ్వాలి
- నిజాం షుగర్ ఫ్యాక్టరీని తిరిగి తెరిపించాలి : రవీంద్రన్



సమావేశంలో మాట్లాడుతున్న రవీంద్రన్

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలోని చెరుకు రైతుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివక్ష చూపుతుండటంతోనే ఏటేటా చెరుకు సాగు విస్తీర్ణం తగ్గుతున్నదనీ, చెక్కర ఫ్యాక్టరీలు మూతబడుతున్నాయని చెరుకు రైతుల సంఘం అఖిల భారత అధ్యక్షులు డి.రవీంద్రన్ విమర్శించారు. తెలంగాణలో ప్రతి టన్నుకు రూ.5,500 ఇవ్వాలని డిమాండ్ చేశారు. అప్పుడే రైతులకు గిట్టుబాటు అవుతుందని చెప్పారు. చెరుకు సాగు చేసే రైతులకు ఎకరాకు రూ.15 వేల ప్రోత్సాహాన్ని అందించాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు తెలంగాణలోని నిజాం షుగర్ ఫ్యాక్టరీని తిరిగి తెరిపించాలని డిమాండ్ చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో చెరుకు సంఘం రాష్ట్ర కార్యదర్శి బొంతు రాంబాబు అధ్యక్షతన రైతుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రవీంద్రన్ మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు నాయుడు 2003లో తీసుకున్న నిర్ణయం ఫలితంగా చెరుకు సాగు తెలుగు రాష్ట్రాల్లో క్రమంగా తగ్గుముఖం పడుతూ వస్తోందన్నారు. మరోవైపు కేంద్ర ప్రభుత్వం ప్రతి చెరుకు క్రషింగ్ సీజన్ కంటే ముందు ప్రకటించే ఎఫ్ఆర్పీలో మార్పులు చేసిన ఫలితంగానే సాగు నుంచి రైతులు దూరమవుతున్నారని తెలిపారు. గతంలో టన్ను చెరుకుకి 8.5 శాతం పంచదార రికవరీపై ధర నిర్ణయించగా..ప్రస్తుతం దాన్ని కేంద్ర ప్రభుత్వం 10.5 శాతానికి పెంచడం దారుణమని విమర్శించారు. దీనివల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన ధరకు అదనంగా కలిపి పంజాబ్‌లో రూ.4,100, హర్యానాలో రూ.4010, యూపీలో రూ.3,850 ఇస్తున్న విషయాన్ని ప్రస్తావించారు. తెలంగాణలోనూ చెరుకు రైతులకు బోనస్ ఇవ్వాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలు, గిట్టుబాటు కాకపోవటం, వర్షాభావ పరిస్థితులు, కోతుల సమస్య, సాగు ఖర్చులు పెరగటం, కూలీల కొరత నేపథ్యంలో రైతులు చెరుకు సాగుకు దూరమవుతున్నారని గణాంకాలతో వివరించారు. మనదేశంలో 29 మిలియన్ టన్నుల పంచదార అవసరముండగా..27 టన్నుల మాత్రమే ఉత్పత్తి అవుతున్నదని తెలిపారు. తెలంగాణలో 12 చెక్కెర పరిశ్రమలుండగా కేవలం ఏడు మాత్రం ఈ సీజన్లో క్రషింగ్‌కి అవకాశం ఉందని తెలిపారు. అవికూడా మూతపడితే అందులో పనిచేసే కార్మికులు, రోజువారీ కూలీలు కూడా రోడ్డునపడే ప్రమాదముందని వాపోయారు. తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్ మాట్లాడుతూ..నిజాం షుగర్ ఫ్యాక్టరీని రాష్ట్ర ప్రభుత్వం తెరిపిస్తే అనుబంధ పరిశ్రమలు వస్తాయనీ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని చెప్పారు. కూరగాయలు, పంటలకు కేరళ ప్రభుత్వం ఇస్తున్న మాదిరిగా రేట్లను నిర్ణయించాలనీ, బహిరంగ మార్కెట్‌లో ఆ రేటు కంటే తక్కుగా ఉంటే ప్రభుత్వం రైతులకు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మొదటి నుంచీ బిఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు చెరుకు రైతుల్ని విస్మరిస్తున్నాయని విమర్శించారు. బడా కార్పొరేట్లకు చెక్కర ఫ్యాక్టరీలను, వ్యవసాయాన్ని కట్టబెట్టే కుట్రలు జరుగుతున్నాయన్నారు. బ్రెజిల్‌లో ఎకరాకు 60 నుంచి 70 టన్నుల చెరుకు దిగుబడి వస్తుంటే మన దేశంలో మాత్రం అది 30 నుంచి 35 టన్నులే ఉంటుందని తెలిపారు. ఈ నేపథ్యంలో రైతులకు మేలు రకాలైన చెరుకు వంగడాలను అందించాలని డిమాండ్ చేశారు. పంట దిగుబడి పెరిగితే రైతులకు కొంత మేరకు లబ్ధి చేకూరుతుందన్నారు. సబ్సిడీలు ఇవ్వాలని కోరారు.

చెరుకు సంఘం రాష్ట్ర కార్యదర్శి బొంతు రాంబాబు..రాష్ట్ర, దేశ అవసరాలకు అవసరమైన మేరకు చెరుకు సాగు కావాలంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు అనుకూలమైన చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం టన్ను చెరుకుకు రూ 1000 బోనస్ చెల్లించాలనీ, డ్రిప్ ఇరిగేషన్ కు బిందు సేద్యం కు పూర్తి సబ్సిడీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదే సమయంలో చెరుకు ఉప ఉత్పత్తిలో నుంచి రైతులకు వాటా ఇవ్వాలని విన్నవించారు. చెరుకు రైతులకు వడ్డీ లేని రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ అరిబండి ప్రసాదరావు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకట్రాములు, చెరుకు రైతు సంఘం రాష్ట్ర నాయకులు రచ్చ నర్సింహ్మా రావు, తోటకూర రాజు, ఎనమద్ది రామకృష్ణ, నెల్లూరు నాగేశ్వరరావు, లక్ష్మీనారాయణ, ఎ. లెనిన్, సంగన్న తదితరులు పాల్గొన్నారు.

ఓవర్సీస్ స్కాలర్ షిప్ రూ.303 కోట్లు

- వెంటనే విడుదల చేయండి
- 2022 నుంచి నేటి వరకు మొత్తం బకాయిలు క్లియర్ చేయండి
- డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క ఆదేశం

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

పెండింగ్‌లో ఉన్న ఎస్‌సి, ఎస్‌టి, బిసి, ఒసి, మైనారిటీ విద్యార్థుల ఓవర్సీ స్కాలర్ షిప్ బకాయిలు రూ.303 కోట్లు వెంటనే విడుదల చేయాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కలు ఆర్థిక శాఖ అధికారులను ఆదేశించారు. 2022 నుంచి పెండింగ్‌లో ఉన్న స్కాలర్ షిప్ మొత్తాన్ని ఒకేసారి క్లియర్ చేయాలని ఆదేశించారు. నిరాశలో ఉన్న వేల కుటుంబాల్లో డిప్యూటీ సీఎం ఆదేశాలు ఆనందం నింపింది. ఆర్థిక స్తోమత లేకపోయినప్పటికీ విదేశాల్లో ఉన్నత చదువులు చదివి, ఉద్యోగాలు సాధించి ఆర్థికంగా ఉన్నత స్థితికి ఎదగాలని ఆలోచనతో వేలాది మంది పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలు ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌పై విదేశాలకు వెళ్లారు. గత ప్రభుత్వ కాలం నుంచి ఓవర్సీస్ స్కాలర్‌షిప్ అందకపోవడంతో విదేశాల్లో ఉన్న విద్యార్థులు, రాష్ట్రంలో ఉన్న తల్లిదండ్రులు మానసికంగా ఇబ్బంది పడుతున్నారు. ఓవైపు ఓవర్సీస్ స్కాలర్‌షిప్ అందక మరోవైపు అమెరికా, యుకె వంటి దేశంలో కొత్త కొత్త ఆంక్షలతో విద్యార్థులపై మానసిక ఒత్తిడి తీవ్రమైంది. ఆయా దేశాల్లో గతంలో మాదిరిగా చదువుకుంటూ ఉద్యోగాలు చేసుకునే పరిస్థితి ప్రస్తుతం లేదు. అక్కడ రోజురోజుకు ఆర్థిక భారం పెరిగిపోతుంది. మరోవైపు బ్యాంకుల్లో తీసుకున్న ఎడ్యుకేషన్ లోన్ భారం పెరుగుతుంది. ఈ పరిస్థితిలన్నిటిని అవగాహన చేసుకున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు ఈ సమస్యను ప్రాధాన్యత అంశంగా భావించి ఓవర్సీస్ స్కాలర్‌షిప్ మొత్తాన్ని ఒకేసారి క్లియర్ చేయాలని ఆర్థిక శాఖ అధికారులను ఆదేశించారు. తీవ్ర ఇబ్బందుల్లో ఉన్న సమయంలో డిప్యూటీ సీఎం ఆదేశాలతో వేలాది కుటుంబాల్లో కొత్త ఆశలు చిగురించాయి. కష్టకాలంలో ప్రభుత్వం ప్రతి విద్యార్థికి సుమారు రూ.20 లక్షల ఆర్థిక సహాయం అందించడంతో తమ బిడ్డలు అనుకున్న లక్ష్యాన్ని చేరుకుంటారనీ, తమ ఇబ్బందులు తొలగిపోతాయని హర్షం వ్యక్తం చేస్తున్నారు. కష్టకాలంలో ప్రభుత్వం అందించిన ఆర్థిక సహాయంతో అనుకున్న లక్ష్యాన్ని సాధించి రాష్ట్రానికీ, దేశానికి తిరిగి అర్థవంతమైన సేవలు అందించే అవకాశం కలుగుతుందని ఆశాభావంతో ఉన్నట్టు ఓవర్సీస్ విద్యార్థులు తెలిపారు.

పోలీసులకు మరోసారి చిరంజీవి ఫిర్యాదు

- సోషల్ మీడియాలో అభ్యంతరకర పోస్టులపై సైబర్ క్రైమ్‌కు..

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

మెగాస్టార్ చిరంజీవి మరోసారి పోలీసులను ఆశ్రయించారు. సోషల్ మీడియా వేదిక ఎక్స్‌లో తనపై అభ్యంతరకర పోస్టులు పెడుతున్నారని దయా చౌదరి అనే వ్యక్తిపై బుధవారం సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇటీవల హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు చిరంజీవి దాఖలు చేసిన పిటిషన్‌పై తీర్పు ఇచ్చినప్పటికీ, ఇంకా అదే తరహా పోస్టులు కొనసాగుతున్నాయని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. సంబంధిత వ్యక్తులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. చిరంజీవి ఫిర్యాదు ఆధారంగా సైబర్ క్రైమ్ పోలీసులు కేసు విచారణ ప్రారంభించారు.

డీప్ ఫేక్‌లపై ఇప్పటికే చర్యలు

ఇటీవల కొందరు ఎఐ టెక్నాలజీ సాయంతో చిరంజీవి ఫొటోలను మార్ఫింగ్ చేసి, అశ్లీల వీడియోలు రూపొందించి పలు వెబ్‌సైట్లలో వైరల్ చేశారు. దీనిపై చిరంజీవి అప్పట్లోనే సైబర్ క్రైమ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. అదే విషయమై సిటీ సివిల్ కోర్టును కూడా సంప్రదించారు. చిరంజీవి అనుమతి లేకుండా ఆయన పేరు, ఫొటోలు, వాయిస్‌ను ఎవరూ ఉపయోగించకూడదని కోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

పివి ముందు చూపుతోనే తెలంగాణలో పెట్టుబడులు

- ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

మాజీ ప్రధానమంత్రి పీవీ నర్సింహరావు ముందు చూపుతో అమలు చేసిన ఎల్పీజీ సంస్కరణల వల్లే తెలంగాణకు విరివిగా పెట్టుబడులు వస్తున్నాయని ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు వ్యాఖ్యానించారు. అంతర్జాతీయ ఫాస్ట్ ఫుడ్ దిగ్గజం 'మెక్ డొనాల్డ్స్' 1.56 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో హైదరాబాద్‌లోని హైటెక్ సిటీలో ఏర్పాటు చేసిన 'గ్లోబల్ ఆఫీస్'ను బుధవారం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దశాబ్దాల క్రితం కాంగ్రెస్ సర్కార్ తీసుకొచ్చిన సంస్కరణ ఫలాలు నేడు అందుతున్నాయని అభిప్రాయపడ్డారు. గత రెండేండ్లుగా తమ సర్కార్ అనుసరిస్తున్న పారిశ్రామిక విధానాలు, రాష్ట్రంలో ఉన్న అనువైన ఎకో సిస్టం, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వల్ల రాష్ట్రంలో పరిశ్రమలు పెట్టేందుకు ముందుకొస్తున్నారని తెలిపారు. హైదరాబాద్ 'గ్లోబల్ జిసిసి హబ్ ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తోంది. ఇక్కడ కేవలం టెక్నాలజీకి సంబంధించిన జిసిసిలు మాత్రమే ఏర్పాటు కావడం లేదు. అన్ని రంగాలకు చెందిన జిసిసిలను ఏర్పాటు చేసేందుకు అంతర్జాతీయ, జాతీయ దిగ్గజ సంస్థలు ఎదురు చూస్తున్నాయి. హాస్పిటాలిటీ రంగ దిగ్గజ సంస్థ మారియట్ తన మొదటి జిసిసిని ప్రారంభించేందుకు హైదరాబాద్‌ను ఎంచుకుంది."రైజింగ్ తెలంగాణ" లక్ష్య సాధనకు ప్రభుత్వం కట్టుబడు ఉంది" అని శ్రీధర్‌బాబు అన్నారు.

జిఓ 34ను అమలు చేయాలి

- నవంబర్ 10న కలెక్టరేట్ల ముందు ఆందోళన
- ఎన్‌పిఆర్‌డి తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపు

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

వికలాంగుల సంక్షేమ శాఖను ప్రత్యేక విభాగంగా కొనసాగించాలనే జీవో నెంబర్ 34ను అమలు చేయాలని నవంబర్ 10న రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కలెక్టర్ కార్యాలయాల ముందు ఆందోళన నిర్వహించాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పిఆర్‌డి) తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. ఈ మేరకు బుధవారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కె.వెంకట్, యం అడివయ్య, గౌరవ అధ్యక్షులు టి వరమ్మ, రాష్ట్ర నాయకులు ఆర్ వెంకటేష్ ఒక ప్రకటన విడుదల చేశారు. మహిళా శిశు, వికలాంగుల సంక్షేమ శాఖల మధ్య జిల్లాల్లో అందుబాటులో ఉన్న ఉద్యోగులను సర్దుబాటు చేసి వికలాంగుల సంక్షేమ శాఖను ప్రత్యేక శాఖగా కొనసాగించాలని 2022 డిసెంబర్‌లో ప్రభుత్వం ఇచ్చిన జీవో మూడేండ్లు గడుస్తున్నా అమలుకు నోచుకోలేదని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 23 నెలలు గడుస్తున్నా... జిఓ నెం 34 అమలుకు చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా వేలాది ఉద్యోగాలను నియమిస్తున్నా, వికలాంగుల సంక్షేమ శాఖకు అవసరమైన ఖాళీలను ఎందుకు భర్తీ చేయడం లేదని ప్రశ్నించారు. జిఓ నెం 34ను అమలు చేయాలని నవంబర్ 10న రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టర్ కార్యాలయాల ముందు నిర్వహించే ఆందోళనలో వికలాంగులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.


రక్తదానం చేస్తున్న డిజిపి శివధర్ రెడ్డి, ఇతర పోలీసు అధికారులు

డిజిపి కార్యాలయంలో రక్తదాన శిబిరం

- రక్తదానం చేసిన డిజిపి శివధర్ రెడ్డి

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం కార్యక్రమాల సందర్భంగా తొలిసారి బుధవారం డిజిపి కార్యాలయంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. డిజిపి బి శివధర్ రెడ్డి రక్తదానం చేశారు. శాంతి భద్రతల అడిషనల్ డిజిపి మహేష్ ఎం భగవత్, ఐజిపి లు ఎస్ చంద్రశేఖర్ రెడ్డి, ఎం రమేష్‌లతో సహా 164 మంది పోలీస్ సిబ్బంది, మినిస్టీరియల్ సిబ్బంది రక్తదానం చేశారు. రెడ్ క్రాస్ సొసైటీ కార్యాక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా డిజిపి బి శివధర్ రెడ్డి మాట్లాడుతూ.. రక్తదానం చేయడం వల్ల మనుషులను ప్రాణాపాయం నుండి కాపాడగలుగుతామన్నారు. ఒకరు రక్త దానం చేయడం వల్ల రక్తంతో పాటు, ప్లాస్మా, ప్లేట్లెట్స్ వంటివి మరో ముగ్గురికి ప్రాణదానం చేసే ఆస్కారం ఉందన్నారు. రక్త దానం చేయటానికి ప్రతి ఒక్కరు ముందుకు రావాలని డిజిపి పిలుపునిచ్చారు. గత రెండు రోజుల క్రితం హైదరాబాద్ సిటీ పోలీస్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరంలో పాల్గొన్నానని, దాదాపు 4,500 యూనిట్ల రక్తాన్ని వారు సేకరించారని వెల్లడించారు. ఏటా ప్రతి ఒక్కరు నాలుగు సార్లు రక్తదానం చేయవచ్చని వైద్యులు చెప్తున్నారని, కనీసం ఒకసారి రక్తదానం చేయడం వల్ల ఎంతో మంది ప్రాణాలను కాపాడగలుగుతామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాలలో దాదాపు ఎనిమిది వేల మంది ప్రాణాలు కోల్పోతున్నారని రక్తం అందుబాటు ఉన్నట్లయితే అందులో కొంతమంది ప్రాణాలైనా కాపాడగలిగే అవకాశం ఉంటుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. ఐజిపి ఎం రమేష్ స్వాగతోపన్యాసం చేస్తూ... రక్తదాన శిబిరం డిజిపి కార్యాలయంలో నిర్వహించడం ఇది తొలిసారి అని పెద్ద ఎత్తున పోలీస్ సిబ్బంది ఈ కార్యక్రమానికి హాజరు కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఎఐజీలు రమణ కుమార్, నాగరాజు, డాక్టర్ పిచ్చిరెడ్డి, రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర పాలక మండలి సభ్యులు, పోలీస్ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపిరెడ్డి తదితరులు రక్తదాన శిబిరం కార్యక్రమంలో పాల్గొన్నారు.

రన్నింగ్ బండి ఎక్కాలి... మూలనపడ్డ కారెక్కొద్దు : పొన్నం ప్రభాకర్

ప్రజాశక్తి –హైదరాబాద్ బ్యూరో

'రన్నింగ్ బండి ఎక్కితేనే మీరు చేరాల్సిన చోటుకు చేరుతారు. మూలకుపడ్డ కారు ఎక్కితే అక్కడే ఉంటారు. ముందుకు పోలేరు. అందుకే జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటు వేయండి' అని రవాణా శాఖ మంత్రి పొన్నంప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో పార్టీ నాయకులు అల్లం భాస్కర్, చరణ్‌కౌశిక్ యాదవ్, బొమ్మ శ్రీరామ్‌తో కలిసి మంత్రి విలేకర్లతో మాట్లాడారు. ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను గెలిపించాలని కోరారు. సంక్షేమం, అభివృద్ధికి జూబ్లీహిల్స్ ప్రజలు పట్టం కట్టాలని కోరారు. బిఆర్ఎస్ అధికారంలో లేదని, ఆ పార్టీకి ఓట్లు వేసినా ఉపయోగం లేదని తెలిపారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నిక వ్యక్తుల మధ్య జరుగుతున్నదని కాదనీ, అభివృద్ధి, అబద్ధాలకు మధ్య జరుగుతున్న పోరాటమని చెప్పారు. జూబ్లీహిల్స్ ప్రాంతంలో బండలను కరిగించి. పేదలకు ఇంటి పట్టాలివ్వడంతోపాటు నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఇండ్లు కట్టించిందని గుర్తుచేశారు. ఆ ప్రాంతంలో ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను చేసింది కూడా తమ ప్రభుత్వమేనని తెలిపారు. పదేండ్లుగా బీఆర్ఎస్ చేసిన అభివృద్ధి చెప్పకుండా తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు. కల్వకుర్తి నియోజకవర్గానికి చెందిన బిజెపి, బిఆర్ఎస్ పార్టీలకు చెందిన పలువురు కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు.



సత్యనారాయణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మహేశ్‌కుమార్‌గౌడ్

మాజీ మంత్రి హరీశ్‌రావుకు టిపిసిసి చీఫ్ పరామర్శ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావును టిపిసిసి అధ్యక్షులు మహేశ్‌కుమార్‌గౌడ్ పరామర్శించారు. బుధవారం హైదరాబాద్‌లోని హరీశ్‌రావు నివాసంలో సత్యనారాయణ రావు చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు. కార్యక్రమంలో ఎస్‌టి కార్పొరేషన్ చైర్మన్ బెల్లయ్యనాయక్, మాజీ ఎంపి మధుయాష్కీగౌడ్, గజ్జి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

డల్కోఫ్లెక్స్ నూతన క్యాంపెయిన్

హైదరాబాద్ : భారత్‌లో ప్రతి ఐదుగురిలో ఒకరు మలబద్ధకంతో బాధపడుతున్న నేపథ్యంలో డల్కోఫ్లెక్స్ కొత్తగా 'నో కన్ఫిపేషన్' పేరుతో నూతన ప్రచారాన్ని ప్రారంభించినట్లు తెలిపింది. ఇందులో హాస్యరసంతో కూడిన నిజజీవిత కథల ద్వారా మలబద్ధకంపై అవగాహన పెంచడమే ఈ క్యాంపెయిన్ లక్ష్యమని ఒపెల్ల సిహెచ్‌సి ఇండియా ప్రతినిధి నుపూర్ గుర్బాక్సని పేర్కొన్నారు. ముఖ్యంగా మహిళల్లో ఎక్కువగా కనిపించే ఈ సమస్యపై మౌనాన్ని బద్దలు కొట్టేందుకు ప్రముఖ స్టాండ్ అప్ కమెడియన్లు ఆంచల్ అగర్వాల్, సృష్టి దీక్షిత్, సౌమ్య వేణుగోపాల్, గుర్లీన్ పన్ను, జేమీ లివర్, శ్రేయ రాయ్‌తో ప్రచారాన్ని కల్పిస్తున్నామన్నారు.



అక్వా రీజియా క్విజ్ విజేత ఆర్మీ పబ్లిక్ స్కూల్

ప్రజాశక్తి - హైదరాబాద్

టైమ్ సిఎల్‌ఎ ప్రెప్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఆక్వా రీజియా - ది స్కూల్ క్విజ్ 2025'లో హైదరాబాద్ రీజినల్ ఫైనల్స్‌లో ఆర్మీ పబ్లిక్ స్కూల్ (బోలారం) విజయం సాధించింది. ఈ క్విజ్ పోటీ బషీరబాగ్‌లోని భారతీయ విద్యాభవన్‌లో జరిగింది. ముందుగా 'ఆక్వా రీజియా - ది సైన్స్ క్విజ్' పేరుతో నిర్వహించిన ఈ పోటీ 2007లో ప్రపంచంలోనే అతిపెద్ద క్విజ్ కార్యక్రమంగా గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించింది. ఈసారి జ్ఞాన్ ప్రకాష్ లెంకా, భవ్యమన్ శర్మలతో కూడిన ఆర్మీ పబ్లిక్ స్కూల్ జట్టు రీజినల్ ఫైనల్స్‌లో అద్భుత ప్రదర్శన కనబరిచింది. వీరు నాగ్‌పూర్ కు చెందిన అంబేద్కర్ కాలేజ్ విద్యార్థులు పార్థ్ రవీంద్ర తోటే, శ్రీవల్లభ నచికేత్ చాబుక్స్వార్ జట్టును ఫైనల్ రౌండ్‌లో ఓడించారు. లిటిల్ ఫ్లవర్ స్కూల్ (ఉప్పల్)కు చెందిన సీ ప్రభాత్, ఎన్ రిధాంశుల జట్టు సెకండ్ రన్నర్ అప్‌గా నిలిచింది. ఈ సందర్భంగా క్విజ్‌మాస్టర్ భరత్ సీ జైన్ మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం 'ఆక్వా రీజియా' యువతలో ఉన్న అపారమైన ప్రతిభను గుర్తు చేస్తుందన్నారు.

హరీశ్‌రావును పరామర్శించిన వ్యకాస, సిఐటియు నేతలు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావును అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి.వెంకట్, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, రాష్ట్ర కార్యదర్శి జె వెంకటేశ్ పరామర్శించారు. ఈ నేపథ్యంలోనే బుధవారం హైదరాబాద్‌లోని హరీశ్‌రావు స్వగృహానికి వారు వెళ్లారు. హరీశ్‌రావు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. సత్యనారాయణరావు చిత్రపటానికి నివాళి అర్పించారు.

హైదరాబాద్‌పై 'మొంథా' ఎఫెక్ట్

- ఎడతెరిపి లేకుండా వర్షం
- జలమయమైన రహదారులు
- పలుచోట్ల భారీగా ట్రాఫిక్ జామ్
- జంటజలాశయాల గేట్లు ఎత్తివేత
- లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసిన అధికారులు



లక్డికపూల్ పరిసర ప్రాంతాలను పరిశీలిస్తున్న హైడ్రా, జిహెచ్‌ఎంసి కమిషనర్లు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ నగరం, శివారు ప్రాంతాల్లో బుధవారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. జీహెచ్‌ఎంసీ పరిధితోపాటు నార్సింగ్, మంచిరేవుల ప్రాంతాల్లో భారీ వర్షంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. మంచిరేవుల కల్వర్టుపై నుంచి వరద నీరు పారుతుండటంతో రాకపోకలు బంద్ చేశారు. పలు ప్రాంతాల్లో రోడ్లన్నీ చెరువులను తలపిస్తున్నాయి. మ్యాన్‌హోల్స్ పొంగిపొర్లుతున్నాయి. పలు కాలనీలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. మాసబ్ ట్యాంకు నుంచి లక్డికపూల్ వైపు రహదారిలో మెహదీ ఫంక్షన్ హాల్ వద్ద వర్షపు నీరు నిలవడంతో తీవ్ర ట్రాఫిక్ సమస్యలు తలెత్తాయి. ఐటీ కారిడార్‌తోపాటు మరికొన్ని ప్రాంతాల్లో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. గచ్చిబౌలి, ఖాజాగూడ, నానక్‌రాంగూడ, ముషీరాబాద్, ఆర్టీసీ క్రాస్ రోడ్స్, గాంధీనగర్, కవాడిగూడ, భోలక్‌పూర్, అంబర్‌పేట, రామంతపూర్, కాచిగూడ, నల్లకుంట, బర్కత్‌పురా, విఎస్‌టి, ఆర్‌టిసి క్రాస్‌రోడ్స్, చిక్కడపల్లి, బాగ్‌లింగంపల్లి, దోమలగూడ, బిఎన్‌రెడ్డినగర్, మీర్‌పేట్, బాలాపూర్, బడంగ్‌పేట్, మహేశ్వరం, తుక్కుగూడ, పహాడీషరీఫ్, జవహర్‌నగర్‌లో వర్షం కురిసింది.

క్షేత్ర స్థాయిలో జిహెచ్‌ఎంసి, హైడ్రా కమిషనర్

వర్షాల నేపథ్యంలో లక్డికపూల్ పరిసర ప్రాంతాలను బుధవారం హైడ్రా, జిహెచ్‌ఎంసి కమిషనర్లు ఎవి రంగనాథ్, ఆర్‌వీ కర్ణన్ పరిశీలించారు. మెహదీ ఫంక్షన్ హాల్ వద్ద వర్షపు నీరు రోడ్డుపై నిలవడానికి కారణాలను అధికారులను అడిగి వారు తెలుసుకున్నారు.

వర్షపు నీరు నిలవడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని, వెంటనే సమస్యను పరిష్కరించాలని అధికారులను ఇరువురు కమిషనర్లు ఆదేశించారు. ఇప్పటికే ఇక్కడ ఇరువైపులా రోడ్డును తవ్వి రెండు అడుగుల విస్తీర్ణంతో ఉన్న పైపు లైన్లు వేశామని, వాటిలోకి మహవీర్ ఆస్పత్రి పరిసరాలతోపాటు చింతలబస్తీ ప్రాంతాల నుంచి వచ్చే మురుగు, వరద నీటిని అనుసంధానం చేయాల్సినవసరం ఉందన్నారు. ట్రాఫిక్ పోలీసులు కూడా సహకరించి పైపులైన్ల అనుసంధాన పనులు త్వరగా జరిగేలా సహకరించాలని సూచించారు. కమిషనర్ల వెంట హైడ్రా అదనపు సంచాలకులు వర్ల పాపయ్య, ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాస్ ఉన్నారు.

జంట జలాశయాలకు భారీగా వరద నీరు

జంట జలాశయాలైన హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్‌కు భారీగా వరద నీరు వస్తోంది. ఈ నేపథ్యంలో జలమండలి అధికారులు అప్రమత్తమయ్యారు. ఉస్మాన్‌సాగర్‌కు 3400 క్యూసెక్‌ల ఇన్‌ఫ్లో రావడంతో 2240 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. హిమాయత్‌సాగర్‌కు 5600 క్యూసెక్కుల వరద నీరు రావడంతో 3963 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. హిమాయ త్‌సాగర్ ప్రస్తుత నీటిమట్టం 1762.25 అడుగులుగా ఉంది. ఉస్మాన్‌సాగర్ ప్రస్తుత నీటిమట్టం 1789 అడుగులుగా ఉంది. మూసీ నది పరివాహక ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశారు.

అప్రత్తంగా ఉండాలి: జలమండలి ఎండి

భారీ వర్షం కురుస్తున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని జలమండలి ఎండి అశోక్‌రెడ్డి ఆదేశించారు. సీవరేజీ ఓవర్ ఫ్లో అయ్యే మ్యాన్ హోల్స్ గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని చెప్పారు. ముంపునకు గురైన ప్రాంతాల్లో మ్యాన్‌హోల్స్ దగ్గర హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

దేవాలయ అభివృద్ధి పనులను పూర్తి చేయాలి

- సిఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ కెఎస్ శ్రీనివాస రాజు



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న శ్రీనివాస రాజు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వచ్చే సంవత్సరం జనవరి 28 నుంచి 31వ తేదీ వరకు జరగనున్న మేడారం సమ్మక్క-సారలమ్మ మహా జాతర సందర్భంగా చేపట్టిన అభివృద్ధి పనులను త్వరితగతిన, నాణ్యతతో పూర్తి చేయాలని సిఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ కెఎస్ శ్రీనివాస రాజు అధికారులను ఆదేశించారు. బుధవారం ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలోని సమ్మక్క-సారలమ్మ వనదేవతలను జిల్లా కలెక్టర్ టిఎస్ దివాకర, ఆర్‌అండ్‌బి ఇఎన్‌సి మోహన్‌నాయక్‌తో కలిసి ఆయన దర్శించుకున్నారు. అనంతరం అభివృద్ధి పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీనివాస రాజు మాట్లాడుతూ.. నూతనంగా ఏర్పాటు చేయనున్న ప్రాంగణం పనులు, పలుచోట్ల చేపట్టిన రోడ్డు విస్తరణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు. గుత్తేదారులు చేపట్టిన ఆయా పనులను సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ నాణ్యత లోపించకుండా జాగ్రత్త పడాలని, సమయానికి అన్ని పనులను పూర్తి చేయాలని సూచించారు. మేడారం వనదేవతలను దర్శించుకోవడానికి వస్తున్న భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా పనులు చేపట్టాలని సూచించారు. ప్రస్తుతం చేస్తున్న పనులు శాశ్వతంగా నిలిచిపోయేలా ఉండాలని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వెంకటేష్, ఆర్‌అండ్‌బి, పిఆర్, ఎలక్ట్రిసిటీ ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్, ఎండోమెంట్ అధికారులు, పూజారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

550 మంది నకిలీ వైద్యులపై కేసులు


- టిజిఎంసి వైస్ చైర్మన్ డాక్టర్ శ్రీనివాస్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రవ్యాప్తంగా 550 మంది నకిలీ వైద్యులపై కేసులు నమోదు చేసినట్టు తెలంగాణ మెడికల్ కౌన్సిల్ (టిజిఎంసి) వైస్ చైర్మన్ డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అర్హత లేకుండా యాంటీబయాటిక్స్, స్టెరాయిడ్స్, పెయిన్ కిల్లర్స్, గర్భవిచ్ఛిత్తి మందులను తప్పుగా వాడుతుండటంతో కిడ్నీలు, లివర్, హార్మోన్ వ్యవస్థకు నష్టం కలుగుతోందని తెలిపారు. దీంతో ప్రజల ఆరోగ్యం ప్రమాదంలో పడుతోందని హెచ్చరించారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వైద్యారోగ్య అధికారి డాక్టర్ ఉమాగౌరి, రంగారెడ్డి జిల్లా వైద్యారోగ్య అధికారి డాక్టర్ లలితా దేవి నకిలీ వైద్యులపై చట్టపరమైన చర్యలు తీసుకున్నారని ఆయన ప్రశంసించారు. ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ డాక్టర్ రవీందర్ నాయక్‌ను కలిసి, అన్ని జిల్లాల డిఎంహెచ్‌ఒల సమన్వయంతో ముందుకెళ్లనున్నట్టు తెలిపారు. మెడికల్ కౌన్సిల్ అందించిన ఫిర్యాదులు, నమోదు చేసిన క్రిమినల్ కేసుల ఆధారంగా రంగారెడ్డి జిల్లా వైద్యారోగ్య అధికారి డాక్టర్ లలితాదేవి 17 నకిలీ క్లినిక్స్, ఫస్ట్ ఎయిడ్ సెంటర్లపై దాడులు జరిపి చట్ట ప్రకారం సీజ్ చేశారని అభినందించారు. ఆ కేంద్రాలపై కీసర, పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్లలో ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్టు తెలిపారు.

రాష్ట్రంలో పాలన పడకేసింది

- ఏ వర్గం ప్రజలూ సంతోషంగా లేరు
- జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పండి : కెటిఆర్



కార్యక్రమంలో మాట్లాడుతున్న కెటిఆర్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో పాలన పడకేసిందని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ విమర్శించారు. బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో జరిగిన మున్నూరు కాపు ఆత్మీయ సమ్మేళనంలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రభుత్వ అనుసరిస్తున్న విధానాల వల్ల రాష్ట్రంలో ఏ ఒక్కరూ సంతోషంగా లేరని అవేదన వ్యక్తం చేశారు. రైతులు పండించిన ధాన్యం, పత్తి కొనుగోలు చేసే పరిస్థితే లేదని చెప్పారు. అన్నదాతలకు బోనస్, పెట్టుబడి సాయం, విత్తనాలు, ఎరువులు కూడా అందట్లేదని అన్నారు. ఎరువుల కోసం క్యూలో నిలబడి రైతులు చనిపోయే దుస్థితి రాష్ట్రంలో నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. రూ.73వేల కోట్లు రైతుబంధు రూపంలో రైతుల ఖాతాలో వేసిన ఘనత బిఆర్‌ఎస్ ప్రభుత్వానిదని గుర్తు చేశారు. రెండు లక్షల ఉద్యోగాలు, యువతులకు స్కూటీ, మహిళలకు నెలకు రూ.2500, తులం బంగారం ఇస్తామని కాంగ్రెస్ మాట తప్పిందంటూ కెటిఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫ్రీ బస్ పేరు చెప్పి.. ఆ డబ్బులు పురుషుల నుంచి లాక్కుంటున్నారని ఎద్దేవా చేశారు.

పదే పదే ఇందిరమ్మ రాజ్యం అని చెప్పుకుంటున్న కాంగ్రెస్.. ఒక్క ఇల్లు కూడా కట్టకపోగా.. వేలాది ఇండ్లను నేలమట్టం చేస్తున్నదని మండిపడ్డారు. పెద్దల ఇండ్ల జోలికి వెళ్లని హైడ్రా.. పేదల ఇండ్లు కనిపిస్తే కూల్చేస్తోందని విమర్శించారు. 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామంటూ బీసీలను కాంగ్రెస్ సర్కార్ మోసం చేస్తోందని విమర్శించారు. పార్లమెంట్‌లో రాజ్యాంగ సవరణ చేస్తేనే జరుగుతుందని తాము ముందే చెప్పినా, ఈ ప్రభుత్వం పెడచెవిన పెట్టిందని మండిపడ్డారు. కనీసం తమ పదవి కాలంలోనైనా బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని హితవు పలికారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీఆర్‌ఎస్‌ను గెలిపించి కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు.

రంగు మారుతున్న తెల్లబంగారం

- పగిలిన పత్తిలో నీరు చేరి మొలకెత్తుతున్న వైనం
- సగానికి తగ్గనున్న పంట దిగుబడి
- పత్తి బాగా లేదంటూ రూ. 6 వేలకే కొంటున్న దళారులు
- రైతుకు ఆసరా లేకపోగా అప్పులే మిగులు
- సిసిఐ కేంద్రాలు తెరవని సర్కారు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

అధిక వర్షాలతో పత్తి రైతుపై తీవ్ర దెబ్బపడింది. పత్తి నాటి నుంచి పంట చేతికొచ్చేదాకా వర్షాలు వెంటాడుతూనే ఉన్నాయి. ఆరుగాలం కష్టపడుతున్న రైతుకు పంట చేతికొస్తుందన్న గ్యారంటీ లేకుండా పోతున్నది. ఆ పంటను అమ్ముకునేందుకు ఎన్నో కష్టాలు పడాల్సి వస్తుంది. రాష్ట్రంలో 45,04,685 ఎకరాలల్లో సాగైంది. వర్షాధార పరిస్థితులవల్ల వేసిన పత్తి విత్తనాలు మొదట మొలకెత్తలేదు. తర్వాత వచ్చిన అధిక వర్షాలు, వరదల వలన కాత, పూత దెబ్బతిన్నది. పండిన పత్తిని తీయడం ఒక ఎత్తైతే, కూలీలు దొరకడం మరో ఎత్తైంది. తెల్ల బంగారంగా ప్రసిద్ధి చెందిన పత్తి వానలకు రంగు మారుతున్నది. పగిలిన పత్తితో నీరు చేరి గింజలు మొలకెత్తుతున్నాయి. తెల్లగా ఉన్న పత్తి నల్లగా మారతోంది. కాతా, పూత రాలిపోయింది. దీంతోపాటు సరైన సమయంలో వానలు పడి కాలం మంచిగైతే ఒక్కొక్క పత్తి చెట్టుకు నల్లరేగడి నేలల్లో అయితే 80 నుంచి 95 కాయలు కాస్తాయి. దుబ్బ, ఎర్రనేలల్లో అయితే 60 నుంచి 70 కాయలు కాస్తాయి. కానీ ఈసారి జూన్, ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో కురిసిన వానలకు పత్తి దిగుబడి బాగా తగ్గిపోయింది. ఒక్కొక్క చెట్టుకు సగటున 50 నుంచి 60 కాయలకు మించి కాయలేదు. చెట్లపై ఉన్న పత్తి కాయలు పగిలిన తర్వాత కొత్తగా కాత, పూత కూడా వచ్చే పరిస్థితి లేదు. కొన్ని జిల్లాల్లో భారీ వర్షాలకు పొలాల్లో నీరు చేరి నీర్చిచ్చు వచ్చి మొక్కలు చచ్చిపోయాయి. సాధారణంగా ఎకరాకు ఎనిమిది నుంచి పది క్వింటాళ్లు పత్తి దిగుబడి వస్తుంది. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ఐదు లేదా ఏడు క్వింటాళ్ల వచ్చే అవకాశం ఉంది. కొన్ని చోట్ల ఎకరాకు నాలుగు క్వింటాళ్లే వస్తుంది. వీటన్నింటి ఫలితంగా పత్తి ఉత్పత్తి సగానికి తగ్గిపోయింది. రైతు పెట్టుబడి ఖర్చులు పోను రైతుకు మిగిలేది జీరో. ఆరుగాలం కష్టపడిన రైతు పెట్టుకున్న ఆశలు ఆవిరైపోతున్నాయి.

జిన్నింగ్ మిల్లుల జిమ్మిక్కు

పత్తి చేతికొచ్చిన తర్వాత తడి కారణంగా పత్తి నాణ్యత తగ్గి నల్లగా మారడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో సెంట్రల్ కాటన్ కార్పొరేషన్ (సిసిఐ) కేవలం ఎనిమిది శాతం నుంచి 12 శాతం తేమ ఉన్న పత్తినే కొనుగోలు చేస్తామని నిబంధనలు విధించడంతో రైతులు మరింత ఇబ్బంది పడుతున్నారు. వికారాబాద్ జిల్లాలోని ఒక జిన్నింగ్ మిల్లులోకి రైతులు 15 లోడ్ల పత్తి తీసుకెళ్లగా, కేవలం రెండు లోడ్లకే తేమ శాతం సరిపోగా, మిగతా పత్తిని తిరిగి పంపివేశారు. ఒక్క లోడ్ తీసుకురావడానికే రవాణా, కూలీల ఖర్చులు కలిపి రూ.6,000 వరకు ఖర్చు అవుతోందని రైతులు చెబుతున్నారు. పత్తిని తిరిగి తీసుకెళ్లి ఎక్కడ ఉంచాలో తెలియక కష్టాల్లో కూరుకుపోతున్నారు.

కొత్తగా రైతులకు యాప్ కష్టాలు

అసలే కష్టాల్లో ఉన్న రైతులకు 'కపాస్ కిసాన్ యాప్' కష్టాలు వెంటాడుతున్నాయి. సాంకేతిక లోపాల వల్ల కూడా రైతులు గందరగోళానికి గురవుతున్నారు. క్రాప్ బుకింగ్ సమయంలో చిన్న తప్పు జరిగితే, ఆ వివరాలు యాప్‌లో కనిపించడం లేదని రైతులు చెబుతున్నారు. మార్కెట్‌కు వచ్చినప్పుడు కూలీలు దొరకకపోవడం వల్ల కూడా లోడ్లు ఆలస్యమవుతున్నాయి. ఈ నేపథ్యంలో వ్యవసాయశాఖ మంత్రి 20 శాతం తేమ ఉన్నప్పటికీ పత్తి కొనుగోలు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాశారు. కానీ కేంద్రం నుంచి సమాధానం వచ్చేంతవరకు వేచి చూస్తే, రైతుల పరిస్థితి మరింత దయనీయంగా మారే ప్రమాదం ఉంది. కాబట్టి రాష్ట్ర ప్రభుత్వం తక్షణం జోక్యం చేసుకుని పత్తి కొనుగోలు ప్రారంభించాలి.

సిసిఐ కేంద్రాలు ప్రారంభించడం ఆలస్యం

కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కేంద్రాలు సకాలంలో ప్రారంభించడం ఆలస్యం కావడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అక్కడ ఒకటి, ఇక్కడ ఒకటి తెరడంతో దళారులు రంగంలోకి దిగుతున్నారు. పంటను దాచుకోలేక, మార్కెట్‌కు తీసుకపోలేక, వ్యాపారులను ఆశ్రయించక రైతుకు తప్పడం లేదు. రంగు మారింది. తేమ ఎక్కువగా ఉంది. నాణ్యత లేదంటూ సవాలక్ష కారణాలు చెప్పి, అగ్గవకు కొంటున్నారు. జిన్నింగ్ మిల్లు యాజమానులు, దళారులు, అధికారులు కుమ్మక్కై రైతులను భయాందోళనకు గురి చేస్తున్నారు. దీంతో రైతు విధిలేని పరిస్థితుల్లో ఎంతకో అంతకు అమ్ముకుంటున్నారు.

పత్తికి రూ. 475 బోనస్ చెల్లించాలి

పత్తిని మద్దతు ధరకు కొనడంతోపాటు క్వింటాల్ పత్తికి రూ. 475 బోనస్ రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాలి. జిన్నింగ్ చేసి పత్తిని అధిక ధరలకు తిరిగి సిసిఐకి అమ్ముతూ లాభాలు గడిస్తున్నారు. ఈ అక్రమ వ్యాపారుల లాభాలను అరికట్టేందుకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. సీసీఐ కొనుగోలు చేసిన పత్తిని జిన్నింగ్ మిల్లులకు రైతులనే రవాణా చేయించడం, పత్తి తెచ్చిన బస్తాలకు కనీసం డబ్బులు ఇవ్వడం లేదు. శాంపిల్స్ పేరిట పెద్ద ఎత్తున దోపిడి జరుగుతుంది.

భూక్య చందునాయక్, రాష్ట్ర కన్వీనర్, తెలంగాణ పత్తి రైతుల సంఘం

తడి ఉందని తక్కువ రేటు

వానలకు పత్తిలో తడి ఎక్కువగా ఉందని వ్యాపారులు తక్కువ ధర ఇస్తున్నారు. ఇంకా ప్రభుత్వం కొంటలేదు. దీంతో చేసిన కష్టం, పెట్టిన పెట్టుబడి పోను ఏమీ రాదు. వానలకు చేను పాడైపోతుంది. కాతా, పూత వస్తలేదు. రైతుకు నష్టమే.

గద్దం యాదగిరి, రైతు మేడిపల్లి

క్వింటాలుకు ఆరువేలే ఇస్తున్నారు

పత్తి క్వింటాలుకు ఆరువేలే ఇస్తున్నారు. ఈసారి వానలకు తక్కువ పంటొచ్చింది. ఎరువులు, పురుగులు, దున్నటానికి, కలుపులు తీయడానికి, కూలీలకు పోను మిగిలేది ఉండదు. ఈసారి వానలకు పంట దెబ్బతిన్నది.

మహిళా రైతు మంజుల

నష్టపోయిన రైతుల వివరాలను నమోదు చేయాలి

బి. కొండల్‌రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు, రైతు స్వరాజ్య వేదిక

అధిక వర్షాలకు పంట నష్టపోయిన రైతుల వివరాలను నమోదు చేయాలి. వారికి పరిహారం ఇవ్వాలి. 20శాతం తేమ వరకు కనీస మద్దతు ధరకు పత్తి కొనాలి. కపాస్ కిసాన్ యాప్ ఎలా వాడాలో అధికారులే గ్రామాలకు వెళ్లి రైతులకు వెంటనే నేర్పించాలి. యాప్‌లో రిజిస్ట్రేషన్ చేసే బాధ్యత అధికారులు తీసుకోవాలి.కౌలు రైతులకు స్వయంగా రిజిస్ట్రేషన్ చేసుకునే సౌకర్యం కల్పించాలి.



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు

మెడికల్ అండ్ హెల్త్ యూనియన్ మహాసభ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు అనుబంధం) రాష్ట్ర 4వ మహాసభను ఈ ఏడాది నవంబర్ 9న సంగారెడ్డి పట్టణంలో నిర్వహించనున్నారు. ఈ మహాసభను జయప్రదం చేయడం కోసం ఆహ్వాన సంఘాన్ని ఏర్పాటు చేశారు. ఆహ్వాన సంఘం చైర్మెన్‌గా జె.మల్లిఖార్జున్ (సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు), ప్రధాన కార్యదర్శిగా ఎం. యాదగిరి, కోశాధికారిగా ఎస్. మహిపాల్‌లతో పాటు సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు ముఖ్య అతిథులుగా పాల్గొననున్నారు. ఈ మహాసభలను జయప్రదం కోసం బుధవారం హైదరాబాద్‌లోని సిఐటియు రాష్ట్ర కార్యాలయంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు భూపాల్, ఆహ్వాన సంఘం చీఫ్ ప్యాట్రన్స్, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి బి.మల్లేష్, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి పి.శ్రీకాంత్, ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి ఎం.యాదగిరి, కోశాధికారి ఎస్.మహిపాల్, సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు వై.సోమన్న, సిఐటియు సంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు నాగేశ్వరరరావు, ప్రవీణ్ కుమార్, జిల్లా సహాయ కార్యదర్శి ఎన్ రమేష్ తదితరులు పాల్గొన్నారు. మహాసభలో వైద్యారోగ్య శాఖలోని అన్ని క్యాటగిరీల ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం రాబోయే కాలంలో పెద్దఎత్తున ఉద్యమాలు చేయడానికి తీర్మానాలు చేయబోతున్నట్టు వారు వెల్లడించారు. మహాసభ జయప్రదం కోసం ఉద్యోగులందరూ ఆర్థికంగా, హార్థికంగా సహాయ, సహకారాలు అందించాలని కోరారు.

అప్రమత్తంగా ఉండాలి : డాక్టర్ రాజీవ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలనీ టిపిసిసి మెడికల్ అండ్ హెల్త్ వింగ్ రాష్ట్ర చైర్మెన్ డాక్టర్ రాజీవ్ సూచించారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తుఫాను ప్రభావంతో భారీ వర్షాలు, ఈదురుగాలులు వీసే అవకాశం ఉన్నందున తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాలుగా సహాయక చర్యలకు సిద్ధంగా ఉందని తెలిపారు. అవసరమైతే తప్ప ప్రజలు బయటికి రావద్దని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ శ్రేణులు సహాయం చేసేందుకు అందుబాటులో ఉంటాయని తెలిపారు. వివిధ శాఖలు సమన్వయంతో పని చేయాలని కోరారు. వేరే ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

రైతులకు అందుబాటులో ఉండండి

అధికారులకు మంత్రి తుమ్మల ఆదేశం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

భారీ వర్షాలు, మొంథా తుఫాన్ నేపథ్యంలో రైతులకు అందుబాటులో ఉండాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల కలెక్టర్లతో మంత్రి ఫోన్లో మాట్లాడారు. పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. రైతులు తమ పంటలను వర్షాల భారీ నుంచి కాపాడుకోవాలని కోరారు. తొందరపడి తమ పంటలను ఇతరులకు అమ్ముకోవద్దని విజ్ఞప్తి చేశారు.

మహిళా హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం చట్టం చేయాలి

- ఐద్వా జాతీయ అధ్యక్షులు పికె శ్రీమతి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

మహిళా హక్కుల పరిరక్షణ కోసం ప్రభుత్వం చట్టం చేయాలని ఐద్వా జాతీయ అధ్యక్షులు పికె శ్రీమతి డిమాండ్ చేశారు. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) 14వ జాతీయ మహాసభలు 2026 జనవరి 25- 28 తేదీల్లో హైదరాబాదులో జరగనున్న నేపథ్యంలో హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని ఐద్వా రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. మహిళలపై రోజు రోజుకు దాడులు పెరుగుతన్నాయని, ముఖ్యంగా బిజెపి పాలిత రాష్ట్రాల్లో ఈ దాడుల సంఖ్య ఎక్కువగా ఉంటుందని తెలిపారు. తెలంగాణలోని వివిధ జిల్లాల్లో ఇటీవల జరిగిన దాడులు పట్ల ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. అసిఫాబాద్ జిల్లాలో నిండు గర్భిణిని కులాంతర వివాహం చేసుకున్నదని, తక్కువ కులమని భర్త లేని సమయంలో మామ కత్తితో కడుపుపై, గొంతుపై కోసి హత్య చేసిన ఘటన చాలా అమానవీయమని ఆవేదన వ్యక్తం చేశారు. భిన్నత్వంలో ఏకత్వం కలిగి మతసామరస్యానికి బాటలు వేసిన తెలంగాణ రాష్ట్రంలో ఇలాంటి పరువు హత్యలు గడిచిన పదేండ్లలో పెరిగాయాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల మహబూబ్‌నగర్ జిల్లా పిల్లలమర్రిలో జరిగిన ఘటన, వికారాబాద్ జిల్లా కులాంతర వివాహం చేసుకున్న హైదరాబాదులో బ్రతుకుతున్న జంటను విడదీసి గర్భిణీని హత్య చేసిన ఘటనతో పాటు సూర్యాపేట, నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాల్లో వరుస ఘటనలు జరిగినా ప్రభుత్వం స్పందించి చట్టం ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. ఈ అంశాలతో పాటు మద్యం, భ్రూణ హత్యలు, మైక్రో ఫైనాన్స్ తదితర అంశాలపై మహాసభల్లో చర్చించబోతున్నట్టు తెలిపారు. ఈ మహాసభలను హైదరాబాద్ ప్రజానీకం జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఐద్వా జాతీయ కోశాధికారి ఎస్ పుణ్యవతి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి, రాష్ట్ర అధ్యక్షురాలు ఆర్.అరుణ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ, పెన్షనర్ వ్యతిరేకంగా 8వ కేంద్ర వేతన సంఘం నియామకం

- తెలంగాణ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉద్యోగ, పెన్షనర్ వ్యతిరేక తిరోగమన నిబంధనలతో 8వ కేంద్ర వేతన సంఘం నియామకం జరిగిందని తెలంగాణ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ విమర్శించింది. ఈ మేరకు బుధవారం అసోసియేషన్ అధ్యక్షులు పి.‌‌‌‌‌‌‌నారాయణ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పి కృష్ణ మూర్తి, కార్యదర్శి వి కృష్ణ మోహన్ ఒక ప్రకటన విడుదల చేశారు. తీవ్ర జాప్యం తర్వాత ఈ నెల 28న నియమించిన వేతన సంఘం చైర్‌పర్సన్‌గా రంజనా ప్రకాష్ దేశాయ్, పార్ట్ టైమ్ సభ్యురాలిగా ప్రొఫెసర్ పులక్ ఘోష్, సభయ్ కార్యదర్శిగా పంకజ్ జైన్ (పెట్రోలియం కార్యదర్శి) నియమితులయ్యారని తెలిపారు. దీని నియమ నిబంధనలను కూడా నోటిఫై చేశారని చెప్పారు. రెండేండ్ల క్రితం జరగాల్సిన నియామకాన్ని ఆలస్యం చేశారని తప్పుపట్టారు. ఏర్పాటు ప్రకటన వెలువడి తొమ్మిది నెలల తర్వాత అక్టోబర్ 10న ఎఫ్ సిపిఎ పార్లమెంట్ మార్చ్‌తో సహ భారీ నిరసన, ఆందోళన కార్యక్రమాల తర్వాత కూడా అదే ఏర్పాటు చేయాల్సి వచ్చిందని వివరించారు. నిబంధనలు కార్మికులు, పెన్షనర్ల డిమాండ్ల ప్రయోజనాలకు విరుద్ధంగా ఉన్నాయని వారు విమర్శించారు. దేశ ఆర్థిక పరిస్థితులు, ఆర్థిక వివేకం అవసరం, అభివృద్ధికి తగిన వనరులను నిర్ధారించాల్సిన అవసరం, నిధులు లేని నాన్-కంట్రిబ్యూటరీ పెన్షన్ పథకం ఖర్చు, రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రయివేటు రంగంపై దాని ప్రభావాన్ని పరిగణనలోకి తీసుకోవాలని కమిషన్‌ను ఆదేశించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంతకంటే కార్మిక వ్యతిరేక, పెన్షనర్ వ్యతిరేక సూచన మరొకటి ఉండదని అసంతృప్తి వ్యక్తం చేశారు. నిషేధిత ఆదేశాలతో నిండిన ఇలాంటి నిబంధనలను ఎప్పుడు చూడలేదని తెలిపారు. 15వ ఐఎల్సీ ప్రకారం అవసరాల ఆధారిత కనీస వేతనం, జీవన వ్యయ సూచిక గురించి ఎలాంటి ప్రస్తావన లేదని చెప్పారు. కంట్రిబ్యూటరీ లేని పెషన్ పథకాల నిరాధారమైన ఖర్చు అనే ప్రస్తావన పాత పెన్షన్ పథకంపై పరోక్ష దాడిగా వారు అభివర్ణించారు. సీపీసీ సిఫారసు చేసే స్వల్ప ప్రయోజనాలను కూడా తిరస్కరించడానికి ఇది స్పష్టమైన సూచన అని పేర్కొన్నారు.